క్లుప్తంగా

తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలి



విద్యార్థులతో ఫౌండేషన్ చైర్మన్ దుర్గయ్య, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని అక్షర సేద్యం ఫౌండేషన్ చైర్మన్ దుర్గయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామునిపట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, లక్ష్మయ్య, వనజ, ఉమారాణి, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నంగునూరు(సిద్దిపేట): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ మంగళవారం తెలిపారు. నంగునూరు జూనియర్ కళాశాల నుంచి 68 మంది, అక్కేనపల్లి మోడల్ స్కూల్ నుంచి 84 మంది, నర్మేట కస్తూర్బాగాంధీ పాఠశాల నుంచి 16 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం, అలాగే 145 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

శంకరయ్యకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శంకరయ్య

కోహెడ(హుస్నాబాద్): ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు మండల కేంద్రానికి చెందిన వెల్పుల శంకరయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఓరియంటల్ విభాగం తెలుగు సాహిత్య ప్రక్రియ తెలంగాణ నవల సాహిత్యంలో మహిళ జీవన చిత్రణ అంశంపై డాక్టర్ పదాల జగన్నాథరావు పర్యవేక్షణలో పరిశోధన చేశానన్నారు. ఇందుకు విశ్వవిద్యాలయం డాక్టర్ ప్రదానం చేసిందన్నారు. ఓయూలో పీజీ, పీహెచ్‌డీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా రమేశ్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ పురుషుల పొదుపు సంఘం 24వ వార్షిక మహాసభ మంగళవారం జరిగింది. ఆదాయ, వ్యయాలపై చర్చించిన అనంతరం సభ్యులు నూతన అధ్యక్షుడిగా సూరంపెల్లి రమేశ్‌ను ఎన్నుకున్నారు. గ్రామంలోని పురుషులు సంఘంలో చేరి పొదుపు అలవాటు చేసుకొంటే ఆర్థిక ప్రగతి సాధించవచ్చని హుస్నాబాద్ సమితి అధ్యక్షుడు రంగు తిరుపతి అన్నారు. తాకట్టు లేకుండానే రూ.లక్ష వరకు రుణ సౌకర్యం దొరుకుతుందని చెప్పారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

గజ్వేల్‌రూరల్: మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కోర్టు సమీపంలోగల మహాత్మాగాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని బక్రిచెప్యాల గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఉపకార వేతనాలు అందజేత

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు ప్రైవేటు వ్యాపార సంస్థ మంగళవారం ఉపకార వేతనాలు అందజేసింది. ఏటా వ్యాపారంలో వచ్చే లాభంలో కొంత సొమ్మును కార్పొరేట్ కంపెనీల సామాజిక బాధ్యత కోటాలో అందజేస్తున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అమరేందర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు 31 మంది విద్యార్థినులకు అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ..

సిద్దిపేటఅర్బన్: మండలంలోని బూరుగుపల్లిలో మంగళవారం బ్యాంకులు వినియోగదారులకు అందించే స్కీములు, రుణాలు, ప్రభుత్వ పథకాల సబ్సిడీలు ప్రజలకు తెలిపేందుకు ఉద్దేశించిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ రాఘవ, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్, నోడల్ మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ రూ.19.40 కోట్లు

దుబ్బాక మున్సిపాలిటీ అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి

- పట్టణం చుట్టూ రింగ్‌రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ బడ్జెట్ ప్రత్యేక సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ గన్నె వనిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి అంచనా ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన మొత్తం బడ్జెట్ రూ.19.41 కోట్లకు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలిపింది. 2024–25లో అంచనా మున్సిపల్ సాధారణ ఆదాయం రూ.4.98 కోట్లు, పన్నుల ద్వారా 2.80 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.2.18 కోట్లుగా బడ్జెట్‌లో పేర్కొన్నారు. బడ్జెట్‌లో సాధారణ వ్యయం నిధులు రూ.13.12 కోట్లు, ప్రజా సౌకర్యార్థం, వార్డుల అభివృద్ధి కోసం రూ.28 లక్షలు కేటాయించారు. 2024–25 ఆర్థిక సంవత్సరం మిగులు బడ్జెట్ రూ.1.05 లక్షలుగా చూపించారు.

దుబ్బాక–హబ్షీపూర్ వరకు నాలుగు వరుసల రోడ్డు

దుబ్బాక మున్సిపాల్టీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నుంచి హబ్షీపూర్ చౌరస్తా (జాతీయ రహదారి) వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మిస్తామన్నారు. పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతోపాటు వంద పడకల ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్యులు, సిబ్బందిని నియమించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపడతామన్నారు. అధునాతన హంగులతో నిర్మించిన కేసీఆర్ స్కూల్‌లో హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలు నిర్వహించేలా కృషి చేస్తామన్నారు. నాన్ వెజ్, వెజ్ మార్కెట్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. దుబ్బాక పట్టణంలో ఆడిటోరియం, స్విమ్మింగ్ పూల్, మినీ స్టేడియం నిర్మాణం చేపడుతామన్నారు. వారాంతపు సంతకు ప్రత్యేక స్థలం పరిశీలనతో పాటు దుబ్బాక చుట్టూ ఉన్న చెరువులను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. శ్మశాన వాటికలను త్వరగా పూర్తి చేయించి, అన్ని కులసంఘాల భవనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసంపూర్తి పనులను పూర్తి చేసి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ, కమిషనర్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక: దుబ్బాక పట్టణానికి చెందిన గాజుల నరేష్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్, గ్యాస్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పల్లె మీన రామస్వామి, బీఆర్ఎస్ నాయకులు , తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని గోవర్ధనగిరి మాజీ సర్పంచ్ ఎల్లం తల్లి రోశమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించి ఓదార్చారు. రోశమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు కనకయ్య, కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



కొత్తూరులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ములుగు మండలంలోని కొత్తూరు, కొక్కొండ, నర్సాపూర్ గ్రామాలలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలో భాగంగా ఇప్పటికే రెండు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసి ప్రారంభించారని, మరో రెండు ప్రారంభించనున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు స్వీకరించిందని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని నర్సారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గ, దుద్దెడ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు అమలు కాగా, మరో రెండు రోజుల్లో రెండు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసే కార్యాచరణ సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లింగారవు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలి

ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె కుమార్

దుబ్బాక: దుబ్బాక వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు కళాశాల యాజమాన్యం హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు తక్షణమే ఇవ్వాలంటూ కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశం పొందేటప్పుడు ఎలాంటి ఫీజు లేకుండా అడ్మిషన్ పొందొచ్చని, కేవలం విద్యార్థుల ఉపకారవేతనంతో మాత్రమే విద్యనందిస్తామన్నారన్నారు. పరీక్షలు దగ్గరపడటంతో ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఒక్క రూపాయి తీసుకోకుండా కళాశాల యాజమాన్యం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డిని వివరణ కోరగా ఇప్పటి వరకు 90 శాతం మంది విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశామన్నారు.



పైకి ఎగిసి పడుతున్న మిషన్ భగీరథ నీరు



నీరు పైకి ఎగిసి పడకుండా జేసీబీని అడ్డుపెట్టిన ఆపరేటర్

పగిలిన భగీరథ పైపులైన్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి 365(బి) విస్తరణ పనుల్లో భాగంగా జేసీబీతో రోడ్డుకు అడ్డంగా గుంత తీస్తుండగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలింది. దీంతో ఒక్కసారిగా నీరు పైకి ఎగిసి పడింది. ఇలా గంటకు పైగా నీరంతా వృథాగా పోతుండటంతో నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో పట్టణానికి నీటి సరఫరా నిలిచిపోయింది. రోడ్డు విస్తరణ పనుల కారణంగా పట్టణ ప్రజలకి ఇబ్బందులు తప్పడం లేదని ఆరోపణలు వస్తున్నా కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్ నర్సయ్య



మాట్లాడుతున్న కమిషనర్ నర్సయ్య

గజ్వేల్: వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మంచినీటి సరఫరాను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. వెలగని వీధి లైట్లను వెంటనే రిపేర్ చేయించాలని సూచించారు. అసంపూర్తి సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు.

బండి వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గు



అక్కన్నపేటలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బెజ్జంకి పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, రామవరంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

కోహెడ(హుస్నాబాద్): మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి

హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ప్రజాహిత యాత్రలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యక్తిగత విమర్శలను వెంటనే వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు.

బెజ్జంకి(సిద్దిపేట): మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ జాతీయ కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. మంగళవారం బెజ్జంకిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: బండి సంజయ్ మంత్రులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ముస్తాబాద్ చౌరస్తాలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హరికష్ణ ఆధ్వర్యంలో బండి సంజయ్ ఫ్లెక్సీ దహనం చేశారు.

అంగన్‌వాడీలో బేటీ బచావో.. బేటీ పడావో



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జెండర్ సమానత్వం, పిల్లల హక్కులు, గర్భస్థ శిశు నిర్ధారణ నిరోధక చట్టం–1994, గృహహింస నిరోధక చట్టం -2005, చైల్డ్ మ్యారేజ్ చట్టం–2006తో పాటు బాల్య వివాహాలతో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. సుకన్య సమృద్ధి యోజన స్కీం, ఆర్థిక పరమైన అంశాలను వివరించారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉన్న సఖి సెంటర్ (181), పోలీస్ 100, చైల్డ్ లైన్ 1098 సేవలపై మహిళా సాధికారత బృందం అవగాహన కల్పించింది. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ, మహిళా సాధికారత కేంద్ర ప్రతినిధి నాగరాజు, జెండర్ స్పెషలిస్ట్ పద్మ, లావణ్య, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



అనంతసాగర్‌లో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు బాల్‌లింగం, మహిపాల్ రెడ్డి, వెంకటేశ్, రామస్వామి, కవిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్వయం పాలన

తొగుట(దుబ్బాక): మండలంలోని వడ్డెర కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవోగా నీరజ, హెచ్ఎంగా కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులుగా దీపక్, శైలజ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంచంద్రా రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సీఆర్పీ బాలకృష్ణ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

వర్గల్(గజ్వేల్): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి వర్గల్ ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు లేక కార్మికుల బతుకులు దయనీయంగా మారాయన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని, ప్రమాద బీమా జీవో ఉన్నా అమలుకు నోచడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటాచారి, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు కనకయ్య, ఎల్లం, యాదగిరి, చంద్రం, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మట్టి తరలింపు అడ్డగింత

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు గ్రామ జమ్మికుంట చెరువు నుంచి ఇటుక బట్టీ కోసం అక్రమంగా తరలిస్తున్న చెరువు మట్టిని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మంగళవారం చెరువు నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టిని తవ్వి ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మట్టి తరలింపును అడ్డుకున్నారు. తహసీల్దార్ అనంతరెడ్డి మాట్లాడుతూ అక్రమంగా చెరువు నుంచి మట్టిని తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ పారిశుద్ధ్య కార్మికుడి మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు శ్రీరాముల గణేష్ మృతి చెందాడు. మంగళవారం సీపీఎం మండల నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. 15 రోజుల క్రితం గ్రామ పంచాయతీలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడని, వెంటనే హైదరబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారన్నారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడని, ప్రభుత్వం అతడి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని ధర్మారం గ్రామంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కళా బృందం కళాకారులు తమ ఆటపాటలతో నేరాలు, చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలను నమ్మి తమ బతుకులను ఆగం చేసుకోవద్దన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజు, మల్లేశం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డులో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వార్డు కౌన్సిలర్ బత్తుల స్వామి అన్నారు. మంగళవారం ఖాళీ ప్రదేశాలు, మురుగు కాల్వల్లో దోమల నివారణకు యాంటీ లార్వా మందు పిచికారీ చేయించారు. ప్రజలు ఆరోగ్యంపై తగు శ్రద్ధ వహించాలని సూచించారు.

◆ భూ పంపిణీ చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెంలో అర్హులైన దళితులకే భూ పంపిణీ చేయాలని పలువురు బాధితులు మంగళవారం గ్రామంలో ఆందోళన చేశారు. 2017లో జరిగిన భూ పంపిణీలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నిరుపేదలైన 16 కుటుంబాలకు లబ్ధి చేకూరలేదని, వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్‌లో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం గోపూజ, దేవతా విగ్రహాల యాగశాల ప్రవేశం గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

◆ మూఢ నమ్మకాలు నమ్మొద్దు

బెజ్జంకి(సిద్దిపేట): మంత్రాలు, చేతబడులు లేవని, అవి మూఢనమ్మకాలేనని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నరేష్ పేర్కొన్నారు. బెజ్జంకిలోని కేజీబీవీలో మంగళవారం వ్యక్తిత్వ వికాసం–మూఢనమ్మకాల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలోచనలతో ఆవిష్కరణలు సాధ్యమన్నారు. శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ మూఢ నమ్మకాలు వ్యాప్తిలో ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థులు సైన్స్ సైనికుల్లా ముందుకు సాగుతూ ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామానికి చెందిన మహ్మద్ రమ్జు(30)కు భార్య ఆఫ్సానా, కొడుకు, కూతురు ఉన్నారు. రమ్జు గ్రామంలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ పోషణకు రూ.లక్ష వరకు అప్పులు చేశాడు. వీటిని తీర్చే మార్గం కానరాక మూడు రోజుల క్రితం గజ్వేల్–పిడిచెడ్ మార్గంలోని బయ్యారం చౌరస్తా సమీపంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపాడు. వారు అక్కడికి చేరుకొని రమ్జును చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల సూచన మేరకు ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

◆ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సిద్దిపేటకమాన్: ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో వాటిని టాస్క్‌ఫోర్స్, వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నాగదేవత ఆలయం చౌరస్తా మార్గంలో నంబర్ ప్లేట్ లేని రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

◆ ఫోన్ అప్పగింత

మిరుదొడ్డి(దుబ్బాక): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తిరిగి బాధితుడికి అప్పగించినట్లు భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన మాలె సుధాకర్ తన మొబైల్ ఫోన్‌ను మూడు నెలల క్రితం ఖాజీపూర్ నుంచి అక్బర్‌పేటకు వెళ్తుండగా పోగొట్టుకున్నాడు.